
క్లుప్తంగా

శని త్రయోదశి ప్రత్యేక అభిషేకాలు



అమరావతి: ప్రసిద్ధ పంచారామ క్షేత్రమైన అమరారామంలోని అమరేశ్వరాలయంలో శనివారం భక్తులు పెద్ద ఎత్తున శని త్రయోదశి పూజలు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు ఆలయంలోని నవగ్రహ మంటపానికి చేరుకున్నారు. శనీశ్వరునికి శనిగ్రహ దోష పరిహార పూజలను శాస్త్రోక్తంగా అర్చకులతో చేయించారు. మండపం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి సుమారు 200కుపైగా అభిషేకాలు భక్తులు నిర్వహించటం విశేషం.

నేడు ఉచిత వైద్యశిబిరం

క్రోసూరు: క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీస్ ఆసుపత్రి వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సాధారణ జబ్బులు, గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారికి సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లికి వందనం'

క్రోసూరు: మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండంలోని క్రోసూరు, 88 త్యాళ్లూరు, దొడ్లేరు సెక్టార్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు జరిగాయి. పిల్లలు తమ తల్లులకు పాదాభివందనం చేశారు. తల్లి గొప్పతనాన్ని సెక్టార్ సూపర్‌వైజర్లు చిన్నారులకు వివరించారు. కార్యక్రమంలో క్రోసూరు సూపర్‌వైజర్ మాధవి, 88 త్యాళ్లూరు సూపర్‌వైజర్ మైమున్నీసా, దొడ్లేరు సూపర్‌వైజర్ బి.రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయితీపై దాణా పంపిణీ

రాజుపాలెం: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో పాడి రైతులకు సబ్సిడీపై దాణా కట్టలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ(ఏహెచ్) పశువైద్యాధికారి వీరయ్య మాట్లాడుతూ మండలంలో గణపవరం, మొక్కపాడు, రాజుపాలెం గ్రామాలలో పశు వైద్యశాలలు ఉన్నట్లు తెలిపారు. వీటికి 160 కట్టలు ప్రభుత్వం సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో కట్ట రూ.1,110కుగాను సబ్సిడీపై రూ.555కే పేద పాడిరైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రాజుపాలెం పశు వైద్యశాలలో 10 మంది రైతులకు కట్టలు పంపిణీ చేశారు. వేసవి కాలంలో పాడి గేదెలకు దాణా అందించడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. వెన్నశాతం కూడా అధికం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు, మాజీ సర్పంచ్ సఖినాల వలిరాజు, లంకా వీరయ్య, పగడాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ



అచ్చంపేట(క్రోసూరు): క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి తమ సిబ్బందితో కలిసి శనివారం అచ్చంపేట మండలంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ... లైసెన్సు దుకాణాదారులు మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలని పేర్కొన్నారు. లూజ్ విక్రయాలు చేయకూడదని హెచ్చరించామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం షాపులు తెరవాలని అన్నారు. అతిక్రమించినచో చట్టపర చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రయవిక్రయాల, స్టాక్ వివరాలను పరిశీలించారు. నాణ్యత పరిశీలనకు శాంపిల్ సేకరించారు. నాటు సారా, డ్రగ్స్, గంజాయి వంటి వాటి వలన జరిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు కూలీ దుర్మరణం

నాదెండ్ల: ఫ్యాను స్విచ్ వేస్తూ విద్యుదాఘాతమై రైతు కూలీ దుర్మరణం పాలైన సంఘటన కనపర్రులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొగిలి రమేష్ (36) భార్య విజయలక్ష్మి వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. స్నానం చేసి వచ్చిన తరువాత ఇంట్లోని ఫ్యాన్ స్విచ్ వేయడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతమై క్రిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యు లు, స్థానికులు బాధితుడిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇరువురు కుమారులున్నారు.

ప్రచారంలో ఆర్భాటం.. అమల్లో అధ్వానం!

- రోజు రోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం
- నియోజకవర్గంలో వెయ్యికిపైగా వివిధ షాపులు
- నినాదాలకే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం
- ప్లాస్టిక్‌పై కనీస అవగాహన కల్పించని అధికారులు

కూటమి పాలనలో ప్రచార ఆర్భాటం తప్ప ఏ కార్యక్రమమైనా సక్రమంగా అమలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. పారిశుద్ధ్యం మెరుగుకు చేపట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నినాదాలకే పరిమితమైంది. నియోజకవర్గంలోని ముఖ్య ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రత కనిపిస్తోంది. దీనికితోడు ప్లాస్టిక్ వాడకం తగ్గించడంపై అధికారులు దృష్టి సారించడం లేదు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా సాగుతున్నా తనిఖీలు కూడా చేయడం లేదు. దీంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.

పెదకూరపాడు: కూటమి సర్కారు అధికారంలోకి రాగానే హడావుడిగా ప్రారంభించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమల్లో నీరుగారిపోతోంది. పాలకులు, అధికారులు కాసేపు ఫొటోలు దిగడానికే ఇది పరిమితం అయింది. ప్రజలకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలమైంది. ఉదయం లేచింది మొదలు టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా సరకులు, పూలు... ఇలా ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకెళుతున్నారు. ఆఖరికి హోటల్ నుంచి టీ తెచ్చుకునేందుకు సైతం పాలిథిన్ కవర్లను వినియోగిస్తున్నారు. ఇలా ఏ ఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. ఇది భావితరాలకు పెను ముప్పుగా మారుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కానీ పరిస్థితిలో మార్పు రావడం లేదు.

మురుగునీటి పారుదలకు ఆటంకం....

పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం 50 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం. అంతకంటే తక్కువ మందమున్న వాటితోనే నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతోంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు నియోజకవర్గంలో పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు మండల కేంద్రాలలో ఇలాంటి నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు ఎక్కడంటే అక్కడే లభ్యమవుతున్నాయి. రోజూ వాడే కవర్లు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్లపైనే పడేస్తుండటంతో మురుగు కాలువల్లోనికి చేరుతున్నాయి. దీంతో డ్రైనేజీలు పూడుకుపోతున్నాయి. వర్షాలు పడినప్పుడు మురుగునీరు రహదారులపై పొంగి ప్రవహిస్తోంది. పారిశుద్ధ్యంలో లోపించడంతో దోమలు విజృంభిస్తున్నాయి.



పెదకూరపాడు పేరమ్మ వాగులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రభుత్వ చర్యలు శూన్యం

పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదు మండలాలు కలిపి సుమారు వెయ్యికిపైగా కాస్త చెప్పుకోదగిన దుకాణాలు ఉన్నాయి. ఎక్కువ దుకాణాల్లో నిషేధిత పాలిథీన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ప్రత్యామ్నాయంగా జనపనారు, కాగితం కవర్లు వాడాలని ప్రభుత్వం సూచిస్తోంది. ప్రతి మూడో శనివారాన్ని పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కానీ ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా తంతుగా పాలకులు, అధికారులు నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఫొటోలు దిగి మమ అనిపిస్తున్నారు.

ప్లాస్టిక్ నియంత్రణ మన బాధ్యత



ప్లాస్టిక్ కాలుష్యం సముద్రాలకు ఒక తీవ్ర ముప్పు. ఇది సముద్ర జీవులకు, పర్యావరణానికి విఘాతం కలిగిస్తోంది. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించుకోవాలి. ఇది మనందరి బాధ్యత. క్యాన్సర్‌కు కూడా ప్లాస్టిక్ కారణం. క్లాత్, పేపర్ సంచులు వినియోగించాలి.

– వెలితోటి అనిల్‌కుమార్, సామాజిక కార్యకర్త

దుకాణాల నిర్వాహకులకు కౌన్సెలింగ్



మాచర్ల: పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ వెంకటరమణ కోరారు. పరిసర గ్రామాల ప్రజలు పలు పనుల నిమిత్తం మాచర్ల పట్టణానికి వస్తుంటారని, వారు తీసుకొచ్చే ద్విచక్రవాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్క్ చేయడంతో, ఆటోవాలలు, తోపుడు బండ్లు రోడ్లపై పెట్టడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నార న్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు షాప్ యజమానులకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

మురుగు కాలువలో మృతదేహం లభ్యం

సత్తెనపల్లి: పట్టణంలోని 21వ వార్డు కొత్తపేట అంకమ్మ తల్లి గుడి సమీపంలోని మురుగు కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. మూడు రోజుల క్రితం కాలువలో పడిన వ్యక్తి చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. గుర్తుపట్టలేని విధంగా మృతదేహం కనిపించింది. పట్టణ పోలీసులు మృతదేహాన్ని వెలికితీయించి ఆరాతీయగా పట్టణంలో 19వ వార్డుకు చెందిన అడుసుమల్లి యాకోబు (37)గా గుర్తించారు. పట్టణంలో బొప్పాయి కాయలు విక్రయిస్తూ యాకోబు జీవనం వెళ్లదీస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు

రెంటచింతల: బీజేపీ పిలుపులో భాగంగా పార్టీ మండల అధ్యక్షులు బోయ నాగిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సురేష్‌బాబు, కోశాధికారి కొత్త రాజేశ్వరరావు, జనసేన నాయకులు ఎదురాజుల వెంకటేష్, రాము, కిరణ్‌కుమార్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

యుద్ధంలో విజయం కోరుతూ పూజలు

మాచర్ల: పాకిస్తాన్‌ను ఎదుర్కొనే శక్తిని భారత సైన్యానికి ఇవ్వాలని కోరుతూ శనివారం పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కో ఆప్షన్ నెంబర్ బొగ్గవరపు మస్తాన్ రావు, నియోజకవర్గ కోకన్వీనర్ పోకూరి కాశీపతి, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఆలేటి సజ్జనయేలు, ఏచూరి సురేష్ బాబు, పట్టణ ఉపాధ్యక్షుడు మారం వంశీకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సత్తెనపల్లి: పట్టణంలోని వివిధ వార్డుల్లో రూ.1.30 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. 9వ వార్డులోని గుంటూరు రోడ్డు – జడ్జి బంగ్లా వరకు రూ. 37 లక్షలతో బీటీ రోడ్డు, ఏడో వార్డులో అన్నా క్యాంటీన్ – జగ్జీవన్ రావు విగ్రహం వరకు రూ.19.70 లక్షలతో సీసీ రోడ్డు, ప్రభుత్వ ఏరియా వైద్యశాల –మీ సేవ సెంటర్ వరకు రూ. 29 లక్షలతో బీటీ రోడ్డు, తారక రామాసాగర్ వాకింగ్ ట్రాక్‌పై రూ. 16.40 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, 26వ వార్డులో శివాలయం వెనుక రూ.11.20 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్స్, 19వ వార్డులో రూ. 17.50 లక్షలతో కల్వర్టు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్, 9వ వార్డు కౌన్సిలర్ చుక్కా శాంతిశ్రీసాగరిక, 19వ వార్డు కౌన్సిలర్ ఎ.శ్రీనివాసరావు, 26వ వార్డు కౌన్సిలర్ శిరిగిరి సీతామహాలక్ష్మి, మున్సిపల్ డీఈ వెంకటరత్నం, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు బలిజేపల్లి సురేష్‌కుమార్, సయ్యద్ పెద్ద కరీముల్లా, కోమటినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా యుద్ధంలో అమరుడైన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి రఘురామ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సుమన్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

పేద మహిళల స్వయం ఉపాధికి సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వర రావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ఏసుక్రీస్తు ఆగమనం

- గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య
- సత్తెనపల్లిలో ఏసుక్రీస్తు జూబ్లీ-2025 ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు

సత్తెనపల్లి: శాంతి, ప్రేమ, కరుణతో మానవాళికి శుభ సందేశం అందించిన కరుణామయుడు ఏసుప్రభు ఆగమనం ప్రేమ సాగరమని గుంటూరు పీఠాధిపతి మహాఘన చిన్నా బత్తిని భాగ్యయ్య అన్నారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఆవరణలో ఏసుక్రీస్తు జూబ్లీ -2025 ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. తొలుత పునీత అన్నమ్మ దేవాలయం నుంచి హోలీ ఫ్యామిలీ పాఠశాల వరకు జెండాలతో ప్రదర్శన చేపట్టారు. వేడుకల ప్రారంభ ప్రార్థనను తాళ్లచెరువు విచారణ గురువు రెవ. ఫాదర్ పుట్టి అంతోని రాజు చేపట్టగా, పవిత్రాత్మ గీతం తాళ్ళచెరువు సహాయ గురువు రెవ.ఫాదర్ ఎస్.శ్యామ్ నిర్వహించారు. భాగ్యయ్య మాట్లాడుతూ ప్రజలను పాపాల నుంచి రక్షించడానికి ఏసుక్రీస్తు లోకానికి వచ్చాడన్నారు. ప్రేమ, క్షమ క్రీస్తు సందేశమని చెప్పారు. ఆ మార్గంలో పయనించి శాంతియుతంగా జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు నామం మారుమోగింది. ముందుగా పీఠాధిపతులు, సత్తెనపల్లి డీనరీ గురువులు, సత్తెనపల్లి విచారణ గురువు రెవ. ఫాదర్ నెట్టెం రాజేష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. పెదకూరపాడు విచారణ గురువు రెవ. ఫాదర్ పెంటారెడ్డి రాజారెడ్డి జూబ్లీ ఉద్దేశం వివరించారు.



జ్యోతిప్రజ్వలనలో భాగ్యయ్య



ప్రదర్శన ఇస్తున్న క్రైస్తవులు

ప్రకృతి సాగుతో ఎంతో మేలు

అనంతవరం (క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకులు సైదయ్య, సర్పంచ్ రామయ్య, రైతు సంఘం నాయకులు తోక వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025-26 నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని రైతులు, వ్యవసాయ కూలీలు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులు ఆచరిస్తున్న వ్యవసాయ విధానాల వలన భూమిలో కార్బన్ శాతం 0.5 కంటే తక్కువగా ఉందని తెలిపారు. దీని వలన రైతులు వాడే రసాయన ఎరువులు పంటలు తీసుకునే స్థితిలో లేవని చెప్పారు. అంతేకాకుండా పంటలకు చీడపీడలు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. రైతులకు పెట్టుబడుల ఖర్చు పెరుగుతున్నాయని, అవి తగ్గించాలంటే ప్రకృతి వ్యవసాయ విధానం పాటించాలన్నారు. భూమిని సారవంతం చేసేందుకు పీఎండీఎస్(నవ ధాన్యలు) విధానం ఆచరించాలని పేర్కొన్నారు. భూమికి పంట ఉత్పాదక శక్తిని పెంచే గుణం పెరుగుతుందని తెలిపారు. కావున ప్రతి రైతు ఈ విధానం ఆచరించాలని సూచించారు. ఉత్తమ రైతులకు సన్మానం చేశారు. కార్యక్రమానికి హజరబీ, షేక్ బాజీ, కృష్ణవేణి, అరుణ, కోటేశ్వరరావు, పుల్లయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నారులను సన్మార్గంలో నడిపించాలి



దాచేపల్లి: చిన్నారులను సన్మార్గంలో నడిపించాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో పది రోజుల పాటు నిర్వహిస్తున్న సీబీసీ ప్రత్యేక శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. సీబీసీలో చిన్నారులు నేర్చుకున్న బైబిల్ వాక్యాలు చదివి పాటలు పాడారు. పలు పాటలకు నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, సీబీసీ టీచర్లు వినుకొండ కోటేశ్వరి, చెట్టిపాగు శాంతిస్వరూప, చెట్టిపాగు ప్రియాంక, కాటుపల్లి స్వర్ణ, మీసాల అనూష, చెట్టిపాగు ప్రశాంతి, చెట్టిపాగు స్వర్ణ, వినుకొండ సుప్రియా పాల్గొన్నారు. సీబీసీలో పాల్గొన్న చిన్నారులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు. సంఘస్తులు వినుకొండ జానీ, మీసాల ఏసోబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఆటపాటలతో కూడిన విద్య



తుమ్మకోట(రెంటచింతల): అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని తుమ్మకోట-1 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త దాసరి మల్లేశ్వరి అన్నారు. శనివారం కేంద్రంలో మదర్స్ డే సందర్భంగా తల్లికి వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు తమ తల్లుల పాదాలకు పూలు చల్లి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

నేడు పోలేరమ్మ వార్షిక తిరునాళ్ల

ముప్పాళ్ళ: మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో గల పోలేరమ్మ తల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 11వ తేదీన జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. తిరునాళ్లలో భాగంగా అన్నదానం జరుగుతుందన్నారు.

మదర్స్ డే వేడుకలు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం అంగనవాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన మదర్స్ డే వేడుకలు హృదయాన్ని తాకేలా సాగాయి. ఈ సందర్భంగా చిన్నారులు తమ తల్లుల పాదాలకు వినయంతో నమస్కరించి, ప్రేమగా పూలు సమర్పించి సత్కరించారు. తల్లిదండ్రుల పాత్ర, వారి అమూల్యమైన త్యాగాలపై అంగనవాడీ కార్యకర్తలు శ్రద్ధగా పిల్లలకు అవగాహన కల్పించారు. తల్లులు తమ పిల్లలను ఆలింగనం చేసుకుని ఆశీర్వదించిన హృద్య క్షణాలు అందరినీ ఆకట్టుకున్నా యి. పిల్లల అభిమానానికి తల్లులు భావోద్వేగంతో స్పందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.పున్నమ్మ, బి.అనురాధ, టి.సుధారాణి పాల్గొన్నారు.

ఐదు ఎకరాల గడ్డి వాములు దగ్ధం



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదు ఎకరాల వరి గడ్డి వాములు దగ్ధమై లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఎగిటి ఆంజనేయులు, ఎగిటి వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ రెండు వాము లు పక్కపక్కనే ఉన్నాయి. గడ్డివాముల నుంచి పెద్ద ఎత్తున మంటలు రావటం గమనించిన గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ మంటలను పక్కకు వ్యాపించకుండా గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకున్నారు. సమాచారాన్ని నరసరావుపేట అగ్నిమాపక అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పరామర్శ

దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని అలుగుమల్లెపాడుకి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నూకన కోటేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కోటేశ్వరరావు ఇటీవల వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కోటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. దాచేపల్లి 5వ వార్డుకి చెందిన వైఎస్సార్ సీపీ నేత యర్రబెల్లి నాసర్ రెండు రోజుల క్రితం మృతి చెందటంతో కుటుంబ సభ్యులను కాసు పరామర్శించారు. తక్కెళ్లపాడులో మాజీ ఎమ్మెల్యే కాసు పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. కాసు వెంట పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, ఎంపీపీ కందుల జాను, ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, నాయకులు కె.సాంబయ్య, కె.విజయ్‌కుమార్, మహేష్‌బాబు, షేక్ ఖాదర్‌బాషా, ఎం.శ్రీనివాసరావు, ఐలయ్య, ఎం.నరసింహారావు, పి.నరసింహారావు, జి.గోవర్ధన్‌రావు, ఆర్. కోటయ్య, పి.వీరయ్య ఉన్నారు.



కోటేశ్వరరావుని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు

రేపు అనుపులో రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం

తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు

విజయపురిసౌత్: మాచర్ల మండలం అనుపులో పవిత్ర కృష్ణా నది తీరాన కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించేందుకు పురావస్తుశాఖ అధికారులు,ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. భక్తులు ఉదయాన్నే కృష్ణా నదిలో స్నానం ఆచరించి శ్రీ రంగ నాథస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు అంగరంగ వైభవంగా జరిగే ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు పల్నాడు ప్రాంతం నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల నుండి భక్తులు వేలాదిగా తరలివస్తారు.



అనుపులో వేంచేసి యున్న రంగనాథస్వామి

గ్రామస్థాయిలోనూ పార్టీని బలోపేతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: గ్రామ స్థాయిలో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని బలోపేతం చేయటానికి కృషి చేయాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఇటీవల పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నిమింపబడిన అలా లక్ష్మీనారాయణ శనివారం గుంటూరులోని కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించారు. అనంతరం శంకరరావును లక్ష్మీనారాయణ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, కె.హరిబాబు, ఎ.శ్రీనివాసరెడ్డి, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శంకరరావును సత్కరిస్తున్న అలా లక్ష్మీనారాయణ తదితరులు

ఘనంగా దేవాలయాల పునఃప్రతిష్ట

బొల్లాపల్లి : మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో శ్రీగంగా గౌరీశంకర, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల పునఃనిర్మాణంతో పాటు ఆయా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆయా దేవాలయాలను పలువురు దాతల సహకారంతో రూ.4.50 కోట్లతో పునఃనిర్మాణంతో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాలు, గ్రామనడిబొడ్డున బొడ్రాయి ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు అంగరంగవైభవంగా సంప్రదాయంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో శివశంకర్లు పార్వతీదేవి, సుబ్రహ్మణ్య స్వామి, వీరభద్రుడు, కాళభైరవుడు, ఆంజనేయ స్వామి, వినాయక స్వామి, నాగేంద్ర స్వామి దేవతామూర్తుల విగ్ర హాల ప్రతిష్ట చేశారు. ఉమ్మడి కడప జిల్లా బద్వేల్‌కు చెందిన సీతారామశాస్త్రి వేదపండితుల మంత్రోచ్ఛరణ, పూజా కార్యక్రమాలతో పునః ప్రతిష్ట కనులవిందుగా జరిగింది. ఈ ప్రతిష్టా కార్యక్రమంలో సుమారు 36 జంటలు పీటలమీద కూర్చుని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.



హోమాలు నిర్వహిస్తున్న భక్తులు